# పెండ్లి సంబంధం

రచన
కాసుఖేల కామేశ్వరరావు.

"అమ్మా, మామపెళ్ళికి నేనుకూడా వస్తానే" అని ఇల్లంతా గల్లంతు చేస్తున్నాడు కిష్టయ్య కిష్టయ్య ఎస్. ఎస్. ఎల్. సి చదువుతున్నాడు సెలెక్షన్ పరీక్షలు డిశంబరులో జరుగుతాయి, బాగా చదవమని, వాళ్లమ్మ కామమ్మగారు కొడుకుని పెండ్లికి రావద్దని మందలించింది. కామమ్మగారి పిన తండ్రి కుమారునికి, కాకినాడలో పెండ్లి అని, అందరూ తప్పకుండా రావలెనని వుత్తరాలు చాలా వచ్చాయి సరే ఎల్లాగైతేనేం కిష్టయ్య పంతంనెగ్గి, అమ్మ, కొడుకు పెండ్లి ప్రయాణానికి సిద్ధమయ్యారు

కామమ్మగారి పినతండ్రికొడుకు చిట్టిబాబు పట్నంలో వుద్యోగం చేస్తున్నాడు. పెండ్లికోసరమని, వారంరోజులు ముందుగా శెలవుపెట్టి, పెండ్లికి కావలసినవన్నీ సిద్ధంచేసుకొని, సెంట్రల్ స్టేషనులో రాత్రి 7 గంIIల పూరీ ప్యాసింజరులో ఎక్కాడు కిష్టయ్యకు పెండ్లికొడుకువాళ్లు ఫలానా బండిలో వస్తున్నారని ముందుగా తెలియడంవల్ల, కిష్టయ్య వాళ్ళమ్మతో, పెండ్లివాండ్లను కలుసుకొని ప్రయాణం సాగించాడు కిష్టయ్య వయస్సు 16 సంIIలు వుట్టి వెర్రిబాగులవాడు పాపం పెండ్లిలో లడ్డూలు, జిలేబీలు అన్నీ, రుచులు రుచులుగా తినవచ్చుననుకుంటూ, తనలో లొట్టలేసుకుంటూ, వూహా ప్రపంచంలో మునిగిపోయ్యాడు ఇంతలో తెల్లవారింది రైలు మెల్లగా బెజవాడస్టేషనుకు చేరింది బెజవాడలో ఇంకా రావలసిన బంధువులందరూ కూడా ఆ రైలులోనే ఎక్కారు అందరూ ఎక్కడంవల్ల కిష్టయ్య సరదాకు అంతులేకపోయింది రాజమండ్రి స్టేషను వచ్చేసరికి పగలు 12 గంII లయింది. అక్కడ హోటల్లో భోజనం అయిపోయిందన్నారు. అందువల్ల పెండ్లివారందరూ ఆకలి బాధతో అన్నంకోసం ఎదురు చూస్తూ ఎంత ప్రయత్నించినా లాభంలేనందువల్ల, కళ్ళూ కాళ్ళు తేలవేసి చతికిల బడ్డారు ఎన్ని తినుబండారాలు తిన్నా అన్నం తినట్టుండదాయెను చివరికి అలాగే ప్రయాణం సాగించారు. బండీ సాయంత్రం 4-5 గంIIలకు సామర్లకోట చేరుకుంది అక్కడ ఏదో సాంబారు సాదం వున్నదని, అందరూ అక్కడికి పరుగెత్తి వెళ్ళారు. కాని దురదృష్టవశాత్తు అక్కడ 3 పొట్లాలు మాత్రమే వీరికి చిక్కాయి. పాతికమంది పెండ్లివారికి, 3 పొట్లాలు ఏమూలకొస్తాయని ఎల్లాగో కళ్ళుమూసుకొని కూర్చున్నారు కాకినాడ బండీ వచ్చింది అందులోపడి రాత్రి 9 గంII లకు కాకినాడ చేరుకున్నారు.

పెండ్లివారు వచ్చారని, వీళ్లకు ఆడపెళ్ళివారు ఓ విడిది చూపించారు రాత్రి 11 గంII లకు భోజనాలకు రావలసిందని పిలుపువచ్చింది అన్నం అన్నమాట చెవిని పడగానే పెండ్లివారంతా తొందర తొందరగా పరుగెత్తుకెళ్ళి భోజనాల దగ్గర కూర్చున్నారు. కిష్టయ్య నెల్లూరువాడు. నెల్లూరు బియ్యం అంటే దేశం అంతా ప్రసిద్ధి అటువంటి అన్నం తినేవాడు ఆరోజు అక్కడి అన్నాన్ని చూచి, "కాకినాడ యింత పెద్ద సిటీ కదా, వీళ్ళకు యిల్లాంటి బియ్యం ఎక్కడ దొరికాయిని" అన్న సమస్యలో పడ్డాడు. కానీ యిలా ఆలోచిస్తూ కూర్చుంటే మరి ఆకలి తీరేదెలాగ? "ఆకలి రుచి ఎరుగదు, నిద్ర సుఖం ఎరుగదు" అన్నట్లు, కిష్టయ్య ఆ అన్నాన్నే తిని, విడిదికివచ్చి శయనించాడు.

మరునాడు పెళ్లివారు కాలకృత్యాలన్నీ తీర్చుకొని, కాఫీ ఫలహారంకోసరం ఎదురు చూస్తూ కూర్చున్నారు. 9 గంII లయింది ఏ ఆచూకీ కన్పించలేదు 10 గంII లకు ఓ బ్రాహ్మడు 10 మందికి సరిపోయే కాఫీ, ఫలహారం పట్టుకొచ్చాడు వున్నవారు 25 మంది అయితే 10 మందికి పంపినవి, యింతమందికి ఎలా సరిపోతాయని పంపిన టిఫిన్ కాఫీ ఆడవాళ్ళను తీసుకోమని, కిష్టయ్య మొదలైన మొగవాళ్ళు ఓ కాఫీహోటల్లోకి ప్రవేశించారు. ఆహోటల్లో పెండ్లికొడుకు మామగారికి "కాతా" వుందని తెలిసింది సరే పెండ్లివారందరూ బాగాతిని, అయిన కాతాలో పద్దువ్రాసి బయిటికి వచ్చారు.

ఆరోజు ముహూర్తం. పెండ్లి వాళ్ళందరూ, ముహూర్తం చూడడానికని పెండ్లి పందిట్లో కూర్చున్నారు. పెండ్లి బాగా జరుగుతోంది మామగారు అల్లుడికి యియ్యవలసిన 1116 రూ. సమర్పించుకున్నారు మనకిష్టయ్య పెండ్లికూతుర్ని చూస్తూ కూర్చున్నాడు ఆమెను చూచి, తన మేనమామ ఆపిల్లను

# పెండ్లి సంబంధం

ఎట్లావరించాడా అని ఓ పెద్దసందేహం కలిగింది? పిల్లలావుగా వుంది. ఇంకా అప్పుడే టైఫాయిడ్ జ్వరంవచ్చి తగ్గిందట. కాని ఆమె లావుగానే వుంది. నెత్తిన వెంట్రుకలు అక్కడక్కడా వొక్కొక్కటి కనుపిస్తున్నాయి. చూడడానికి చాలా అందవికారంగా వుంది. ఎల్లావుంటే క్రిష్టయ్యకెందుకని ఆ ఆలోచన విడిచి, లడ్డూల ఆలోచనలో పడ్డాడు. ఎప్పుడెప్పుడు భోజనాలకు రమ్మంటారా అని చూస్తూవున్నాడు

ముహూర్తం మొలడయినవన్నీ సక్రమంగా జరిగాయి 2 గం॥ లయింది భోజనాలకు రమ్మని పిలుపు వచ్చింది. పెండ్లివారందరూ భోజనాలకు తయార్. ఆరోజు వంట ఏమిటంటే "మునక్కాడలు ఒక కాడ 2 ముక్కలుగా తరిగి, గుమ్మడికాయ రెండు ముక్కలుగాజేసి, అవీ, యింకా ఏమిటేమిటోవేసి ఆవరసం చేశారు. మొట్ట మొదటిసారిగా అందరి విస్తళ్ళల్లో పప్పు, ఆవరసం, అన్నం, ఆవకాయ వేసి వెళ్ళారు మంచినీళ్ళు వొక్కసారైనా పొయ్యలేదు. పాపం క్రిష్టయ్యకు అపుపోసనం పట్టందే అన్నం తినే అలవాటు లేదాయెను అందువల్ల నీళ్ళకోసరం ఎదురు చూస్తూ కూర్చున్నాడు నీళ్ళులేవు నిప్పులులేవు. ఎంతసేపు గొంతు పగిలేట్లు అరిచినా నీళ్ళు ఎవ్వళ్ళూ పొయ్యలేదు ఆరోజు ఎల్లాగో అపరాధం చెప్పుకొని అన్నంతినడం మొదలెట్టాడు. చేసిన వంటకాలుకానీ అన్నంగానీ మారు అడగలేదు. క్రిష్టయ్య స్వంత మేనమామ కూతురు, ఓచిన్న అమ్మాయి, పెద్దగా "మా మామ్మయ్య, మాతాతగారి తద్దినానికి గారెలు, పరమాన్నం చేసింది. ఇక్కడ పెళ్ళిలో కూడా ఏంలేవే" అని కేకవేసింది కాని పెళ్ళివారికి సిగ్గుంటేనా? సగం కడుపుకు తిని మొగపెండ్లివారంతా ఎంగిలి చేతుల్తో విడిదికి విచ్చేశారు క్రిష్టయ్యకు లడ్డూల ఆశ పోయి ఎప్పుడెప్పుడు తన వూరికి వెళ్ళి హాయిగా ఆమంచి అన్నం తిందామా అని ఆశ కలిగింది

అలకా, నాగవల్లి అని ఏమిటేమిటో అనుకుంటున్నారు అలక సమయంలో పెండ్లికొడుకుని నీకేం కావాలి బాబూ అని, ఎవరో అడిగారు. సరే చిట్టిబాబూగారు, అమ్మాయి పాట పాడలేనందువల్ల ఓ రేడియో యియ్యమని అడిగాడు. ఇట్లా సరదాగా సంభాషణ జరుగుతూనేవుంది, ఎందుకో, పెండ్లికూతురి మేనమామ, చెప్పుతో కొట్టాను, బూటుతో కొట్టానని అంటూ వొకటే వాగేస్తున్నాడు శుభమా అని పెండ్లి జరిగితే అశుభంగా ఈమాట లెందుకా అని క్రిష్టయ్య వాళ్ళు అనుకుంటున్నారు

కొంత సేపటికి అక్కడ ఆడపెళ్ళివారికి, మొగపెళ్లివారికి మధ్య ఓచిన్న యుద్ధం చెప్పులతోనే జరగ నారంభించింది కాని కారణాలేమీలేవు చివరకి పెండ్లి కూతురు వాళ్ళు ఏమిటో నసుగుకుంటూ వాళ్లింటితోవ పట్టారు అన్నీ సమంగా జరిగి వున్నట్లయితే ఆరోజు రాత్రి నాగవల్లీ, అంపకాలు మొదలయినవి జరిగి వుండవలసినది కాని వాళ్ళకు వీళ్లకు మనస్పర్ధ లేర్పడడంవల్ల, అన్నీ ఆగిపోయాయి. పెండ్లికొడుకు చెప్పకుండా అర్ధరాత్రివేళ, ఆకంకణాలతో ఆపసుపు పంచలతో వుడాయించాడు.

తెల్లవారిలేచి చూచేటప్పటికి పెండ్లికొడుకులేడు. ఇంక ఈవుత్స విగ్రహాలన్నీ ఎందుకనుకొని, మగపెండ్లి వారందరూ, పెట్టెలూ బేడలూ సర్దుకొని ఎవరి వూళ్లకు వాళ్ళు టిక్కెట్లు కొనుక్కొని రైలు ఎక్కారు. రైలులో ప్రతివాళ్లూ "అయ్యో యిదేం విచిత్రం అండీ? యిలా అంపకాలూ అవీ జరగకుండా ఏకర్లో ఏసడు పెండ్లిచేశాడండీ?" అని ఎవరి నోటికొచ్చినట్లు వాళ్ళు అడుగుతున్నారు

నానా అవస్తాపడి క్రిష్టయ్య మళ్ళీ మూడవరోజుకు నెల్లూరు చేరాడు. ఆబడలికవల్ల క్రిష్టయ్యకు జ్వరంవచ్చి సెలెక్షన్ పరీక్షకు వెళ్ళలేదు ఆసంవత్సరం ఎస్ ఎస్. ఎల్. సి పరీక్షకూ వెళ్లలేదు

"క్రిష్టయ్యా, పరీక్షకు వెళ్ళలేదేం?" అని ఎవరన్నా అడిగితే "మేనమామ మేరేజి ఖుషీ" అని అనేవాడు.

★

